క్లుప్తంగా

దుర్గగుడి అధికారులు, సిబ్బందికి ఉత్తమ ప్రతిభ అవార్డులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన వారిలో దుర్గగుడి అధికారులు, సిబ్బంది ఉన్నారు. కలెక్టర్ ఢిల్లీరావు చేతుల మీదుగా వారు ప్రతిభ అవార్డులను అందుకున్నారు. దుర్గగుడి ఈవో కేఎస్ రామారావుకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధికారిగా, ఆలయ ఈఈలు కేవీఎస్ కోటేశ్వర రావు, ఎల్.రమాదేవి, ఏఈవోలు చంద్రశేఖర్, ఎన్.రమేష్‌బాబు, బి.వెంకటరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, ఐటీ కో ఆర్డినేటర్ హరీష్ ఉత్తమ ప్రతిభ అవార్డులు అందుకున్నారు. అవార్డులు అందుకున్న ఆలయ అధికారులు, సిబ్బందికి ఈవో రామారావు తదితరులు అభినందించారు.

అలరించిన భక్తి రంజని



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం బెంగళూరుకు చెందిన పలువురు సంగీత కళాకారులు ఆలపించిన పలు గేయాలు భక్తులను అలరించాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై బెంగళూరుకు చెందిన రాజీస్ మ్యూజిక్ అకాడమికి చెందిన రాజలక్ష్మీ శ్రీకాంత్ శిష్య బృందం భక్తిరంజని ఆలపించారు. వారికి ప్రవీణ్ హరిహరన్ మృదంగం, మధుసూదన్ వయోలిన్, డాక్టర్ స్కందకుమార ఫ్లూట్‌తో సహకరించారు. అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందచేశారు.

రోడ్డుపై కారు పల్టీ



గుణదల (విజయవాడ తూర్పు): మితిమీరిన వేగంతో కారు నడిపిన ఓ వ్యక్తి జాతీయ రహదారిపై బీభత్సం సృష్టించాడు. మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుబ్బారావు కాలనీ పటమటకు చెందిన అజిత్ అగర్వాల్ వ్యక్తిగత పనుల నిమిత్తం బెంజిసర్కిల్ నుంచి రామవరప్పాడు రింగ్ వైపు వెళుతున్నాడు. ఏపీ 40 ఆర్ 2331 నంబరు వైట్ కియా కారులో వెళ్తుండగా జాతీయ రహదారిపై మెట్రోపాలిటన్ హోటల్ వద్ద డివైడర్ స్టోన్‌కు ఢీ కొన్నాడు. పెద్ద శబ్దంతో కారు పల్టీ కొట్టింది. ఘటనలో అజిత్‌అగర్వాల్‌కు గాయాలయ్యాయి. మాచవరం పోలీసులు అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన కారును స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతిపై లైంగిక దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి లైంగిక దాడికి పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. కొత్తూరు తాడేపల్లి రామాలయం ప్రాంతానికి చెందిన యువతికి(19) తన ఇంటి సమీపంలో నివసించే బాణావత్ దుర్గాప్రసాద్‌తో పరిచయం. ఆమె 16 ఏళ్ల వయస్సులో ఉండగా, దుర్గాప్రసాద్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై గతంలోనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అయితే జైలు నుంచి బయటకు వచ్చిన దుర్గాప్రసాద్ నెల రోజులుగా ఆమెతో మాట్లాడటానికి ప్రయత్నిస్తున్నాడు. ఈ నెల 25వ తేదీ దుర్గాప్రసాద్ ఆమెకు ఫోన్ చేసి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. రామవరప్పాడు రింగ్ సమీపంలోని ఓ హోటల్‌లో రూమ్ అద్దెకు తీసుకుని అక్కడకు ఆమెను తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. సాయంత్రం రూమ్ నుంచి ఇంటికి వెళ్లిపోవాలని ఆమెకు చెప్పగా, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేస్తావా అని ప్రశ్నించింది. దీంతో దుర్గాప్రసాద్ బెల్టు తీసుకుని ఆమెను కొట్టాడు. బాధితురాలు తాను మరోసారి మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు

ఆటోనగర్(విజయవాడతూర్పు): పేదలందరికీ సకాలంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎండీ లక్ష్మీశా అన్నారు. శుక్రవారం 75వ రిపబ్లిక్ డే సందర్భంగా విజయవాడ ఆటోనగర్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఇంతవరకు సుమారు 8 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తైనట్లు చెప్పారు. అనంతరం సంస్థ ప్రధాన కార్యాలయంలో, జిల్లా కార్యాలయాల్లో పనిచేస్తున్న సుమారు 300 మంది ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. సంస్థ జేఎండీ శివప్రసాద్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

మదిమదిలో మువ్వన్నెల జెండా

వాడవాడలా గణతంత్ర దినోత్సవం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దేశభక్తి ఉప్పొంగింది. గణతంత్ర దిన వేడుకల సందర్భంగా శుక్రవారం వాడవాడలా నేతలు, అధికారులు జాతీయ జెండాలను ఎగరేశారు. విజయవాడ రైల్వే డివిజన్‌లో జరిగిన వేడుకల్లో డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సీనియర్ డీఎస్‌సీ (డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్) వల్లేశ్వరతో కలసి ఆర్‌పీఎఫ్ బలగాలు, స్కౌట్స్ అండ్ గైడ్స్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం సందేశాన్ని చదివి వినిపించడంతో పాటుగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విజయవాడ డివిజన్ సాధించిన పురోగతిని వివరించారు. రైలు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పించే లక్ష్యంతో 'అమృత్ భారత్ స్టేషన్స్' పథకం ద్వారా డివిజన్‌లో 20 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం విధుల్లో ఆదర్శవంతమైన సేవలు అందించిన 20 మంది ఉద్యోగులకు మెరిట్ సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం జాక్ అండ్ జిల్ స్కూల్, ఎస్‌కేసీవీ చిల్డ్రన్స్ ట్రస్ట్ చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు డి.శ్రీనివాసరావు, ఎం.శ్రీకాంత్, పలు బ్రాంచ్ అధికారులు, ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థాన ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండాను దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కె.ఎస్. రామారావు ఆవిష్కరించారు. తొలుత దుర్గమ్మ, భరతమాత, మహాత్మాగాంధీ, శ్రీరాముల చిత్రపటాలకు ఆలయ అర్చకులు, వైదిక కమిటీ, వేద విద్యార్థులు వేద మంత్రోచ్చారణ మధ్య పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో రామారావు ఎస్‌పీఎఫ్, హోంగార్డు, దేవస్థాన సెక్యూరిటీ సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు చింకా శ్రీనివాసులు, బచ్చు మాధవీకృష్ణ, ప్రత్యేక ఆహ్వానితులు జక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వైదిక కమిటీ సిబ్బంది, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

● చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు ఆవరణలో ఏర్పాటు చేసిన భారీ జాతీయ జెండాను ఎండీ కొల్లి ఈశ్వరబాబు ఆవిష్కరించారు. అనంతరం ఎండీ ఈశ్వరబాబు, చైర్మన్ చలసాని ఆంజనేయులు ప్రసంగించారు. మిల్క్ యూనియన్ సిబ్బంది పాల్గొన్నారు.

● బస్టాండ్(విజయవాడ పశ్చిమ): ఆర్టీసీ ఉద్యోగులు సమష్టిగా కృషి చేసి సంస్థను ముందుకు నడిపించాలని ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణాశాఖాధికారి యేసుదానం పిలుపునిచ్చారు. గణతంత్ర వేడుకలను శుక్రవారం పండిట్ నెహ్రూ బస్టేషన్‌లో ఘనంగా నిర్వహించారు. బస్‌స్టేషన్ డెప్యూటీ ట్రాఫిక్ మేనేజర్ బషీర్ అహ్మద్ ప్రసంగించారు. అనంతరం జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వివిధ డిపోల మేనేజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.



రైల్వే స్టేడియంలో జెండా వందనం చేస్తున్న డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్

అంబేడ్కర్ స్ఫూర్తితో సుపరిపాలన

● వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అంబేడ్కర్ స్ఫూర్తితోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనను కొనసాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. నియోజకవర్గంలో పలు చోట్ల జాతీయ జెండాను ఆవిష్కరించారు.

● పంజా సెంటర్‌లోని వైఎస్సార్ టీయూసీ ఆటో స్టాండ్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో ఆసిఫ్, సంఘ అధ్యక్షులు ఎస్‌కే నియద్దీన్, కార్యదర్శి ఎస్ కాజా, సభ్యులు ఎస్‌కే కరీముల్లా, ఆర్.జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● 37వ డివిజన్ కార్పొరేటర్ మండేపూడి చటర్జీ ఆధ్వర్యాన వీఎంసీ హైస్కూల్లో జరిగిన వేడుకల్లో ఆసిఫ్ పాల్గొన్నారు.

● పాతబస్తీలోని 184, 275 సచివాలయాల వద్ద జరిగిన వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ మండేపూడి చటర్జీతో కలసి హాజరయ్యారు. నేతలు మండల శ్రీను, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

● 51వ డివిజన్‌లో సచివాలయం వద్ద స్టాండింగ్ కమిటీ సభ్యుడు, స్థానిక కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్లు సచివాలయం సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు. తర్వాత చదును మహాలక్ష్మి గుడి వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలవేసి పూజా కార్యక్రమం నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

● కాకరపర్తి భావనారాయణ కళాశాలలో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● 53వ డివిజన్‌లోని మౌలానా ఆజాద్ వీఎంసీ హైస్కూల్, బస్వా అప్పలస్వామి వీఎంసీ పాఠశాల ప్రాంగణాల్లో జరిగిన వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ మరుపిళ్ల అప్పాజీరావు పాల్గొన్నారు.

● ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం విజయవాడ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో రీజనల్ డైరెక్టర్ డాక్టర్ సుమలత, డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన ఉండాలి

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): రాజ్యాంగంపై ప్రతి పౌరుడు అవగాహన ఉండాలని ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, కార్పొరేటర్ బండి నాగేంద్ర పుణ్యశీల పేర్కొన్నారు. కేదారేశ్వరపేటలోని వెలగపూడి లక్ష్మణదత్తు ప్రాథమిక పాఠశాలలో ఆమె జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేస్తున్న పుణ్యశీల

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఆక్టోపస్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎస్పీ(అడ్మిన్) ఎం.నాగేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్తమ పనితీరు కనబరిచిన ఎస్పీ(ట్రైనింగ్) బి.రవిచంద్రకు ఉత్తమ సేవా పతకం, ఇన్‌స్పెక్టర్ కేవీవీ ప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ పి.వెంకటేశ్వర్లుకు సేవా పతకం, ఇన్‌స్పెక్టర్ ఆర్వీ నాయక్, కానిస్టేబుల్ ఎం.సూర్యనారాయణలకు డీజీపీ సిల్వర్ డిస్క్‌లను ప్రదానం చేశారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): రూరల్ మండలం గొల్లపూడిలోని రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు జరిగాయి. కమిషనర్ శ్రీరాము సత్యనారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ చీఫ్ ఇంజినీర్ సుసర్ల శ్రీనివాసరావు, సంయుక్త కమిషనర్ దర్భముళ్ల భ్రమరాంబ ఉప కమిషనర్ రత్నరాజు, సహాయ కమిషనర్ శోభారాణి, టెక్నికల్ ఆఫీసర్ భవిరి రవి పాల్గొన్నారు. యానాపు సాయి కృష్ణ దేశభక్తి గీతాలను ఆలపించారు.

● భవానీపురం క్రాంబ్వే రోడ్డులోని సెయింట్ జాన్స్ పాఠశాలలో జరిగిన వేడుకల్లో ఆర్మీ విశ్రాంత సుబేదార్ కె.నరసింహారావు, పాఠశాల కరస్పాండెంట్ టీ సుమన్ త్యాగరాజ్, అకడమిక్ హెడ్ కల్యాణి, పావని దీప్తి, ప్రిన్సిపాల్ సుచరిత పాల్గొన్నారు. గొల్లపూడిలోని అంబేడ్కర్ విద్య అకాడమీ హైస్కూల్‌లో జరిగిన వేడుకల్లో వన్‌టౌన్ కొత్తపేటలోని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ 1985–86 బ్యాచ్ పూర్వ విద్యార్థులు గంగాధర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం 65 అంగుళాల స్మార్ట్ టీవీ బహూకరించారు. స్కూల్ కమిటీ సభ్యులు ఆర్. సత్యనారాయణ, నరసింహారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. విద్యాధరపురంలోని భవిత స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లోని బుద్ధిమాంద్యం కలిగిన విద్యార్థులతో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ జె సునీత, వాసవి క్లబ్ సూపర్ స్టార్ విద్యాధరపురం సభ్యులు విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. క్లబ్ సభ్యులు సీహెచ్ అనురాధ, మీనాక్షి, నూనె సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లో 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ పాల్గొని జెండా ఎగురవేశారు. ఎండీ అనీస్, ఎస్‌కే నజీర్, రవూఫ్, కరీముల్లా, నజీర్ యూత్ పాల్గొన్నారు. విద్యాధరపురంలోని బెజవాడ రాజారావు హైస్కూల్, డీఎస్‌ఎంసీ హైస్కూల్‌లో గణతంత్ర వేడుకలు జరిగాయి.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఈఓ రామారావు



జెండా వందనం చేస్తున్న కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్



గాంధీజీ హైస్కూల్‌లో విద్యార్థులకు బహుమతులందిస్తున్న ఆసిఫ్, చటర్జీ తదితరులు



రైల్వే స్టేడియంలో సాంస్కృతిక ప్రదర్శన



సెయింట్ జాన్స్ స్కూల్లో ఫ్యాన్సీ డ్రెస్‌లో చిన్నారులు



కేబీఎన్ కాలేజీలో సాంస్కృతిక ప్రదర్శన



మాట్లాడుతున్న మిల్క్ యూనియన్ చైర్మన్ ఆంజనేయులు



అంబేడ్కర్ స్కూల్‌లో టీవీ బహూకరిస్తున్న ఎస్‌కె పీవీవీ హిందూ హైస్కూల్ పూర్వ విద్యార్థులు



భవిత స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లోని బుద్ధిమాంద్యమున్న విద్యార్థులతో వేడుకలు

అందరి సహకారంతో నగరాభివృద్ధి

పటమట(విజయవాడ తూర్పు): అందరి సహకారంతో నగరాన్ని మరింత అభివృద్ధి చేద్దామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో 75వ గణతంత్ర దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ జాతీయ జెండాను, వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి వీఎంసీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం అన్నింటి కంటే ఉన్నతమైనదని, దీనిని లిఖించడంలో ముఖ్య పాత్ర పోషించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయులన్నారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో మూడుసార్లు టాప్ టెన్‌లో నగరపాలక సంస్థ ఉండటం, మెట్రో నగరాలకు దీటుగా అవార్డుని సాధించడం ఎంతో గొప్ప విషయమన్నారు. అనంతరం వీఎంసీలోని వివిధ విభాగాధిపతులతోపాటు, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 99 మంది అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు మెరిట్ అవార్డులను, సర్టిఫికెట్‌లను అందించారు. తొలుత విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్‌కు అభివాదం చేశారు.



మెరిట్ అవార్డు అందుకుంటున్న వీఎంసీ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్

డెస్క్‌టాప్ క్యాలెండర్ ఆవిష్కరణ

గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని, నగరంలో అందమైన చిత్రాలతో కూడిన డెస్క్ టాప్ క్యాలెండర్‌ను మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్ బోయి సత్యబాబు, అదనపు కమిషనర్ (జనరల్) కె. శకుంతల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్, సిటి ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, డెప్యూటీ కమిషనర్ (రెవిన్యూ)డి.వెంకటలక్ష్మి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కబేళా విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11 కేవీ లలితానగర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ టీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు లలితానగర్, నూరి మసీదు రోడ్డు, రైతుబజార్ రోడ్డు, రేపాకు వారి రోడ్డు, టెలిఫోన్ కాలనీ, పోలీస్ కాలనీ, నేతాజీ హైస్కూల్ రోడ్డుక్కడ తదితర ప్రాంతాల్లో కరెంట్ నిలిపివేయనున్నట్లు వివరించారు.

● శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు అల్లుడు పేట, బ్యాంక్ సెంటర్, సుధాకర్ మెడికల్ షాప్ రోడ్డు, రాజేంద్ర స్ట్రీట్, నాగార్జున స్ట్రీట్, మసీదు రోడ్డు, రంగూన్ సాహెబ్ స్ట్రీట్, కరకట్ట, ఆలివ్ హోటల్ వెనుక వైపు, సైన్స్ సెంటర్ ఏరియాల్లో కరెంట్ ఉండదు

● మిల్క్ ప్రాజెక్ట్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సయ్యద్ అప్పలస్వామి కాలేజి వెనుక పక్కగల కొండ ప్రాంతం, వీజీఎస్ పబ్లిషర్స్ ఏరియా, రాజీవ్‌శర్మనగర్, లంబాడీపేట, సాయిరాం సినిమా హాల్ ఏరియా, కలరా హాస్పటల్ కొండ ప్రాంతం, కుండల బజార్ మార్కెట్ ఏరియా, సౌమ్య సినిమా హాల్ ప్రాంతంలో కరెంట్ సరఫరా ఉండదు.

ఆత్మహత్యాయత్నం చేసిన తల్లీపిల్లలను కాపాడిన పోలీసులు

పాయకాపురం(విజయవాడ రూరల్): ఆత్మహత్య చేసుకోబోయిన తల్లీపిల్లలను నున్న పోలీసులు కాపాడిన ఘటన శుక్రవారం జరిగింది. వాంబే కాలనీ సీ బ్లాకులో నివసిస్తున్న చిప్ప నాగరాజు, జ్యోత్స్న దంపతులకు ముగ్గురు కుమార్తెలు. ప్రస్తుతం ఆమె మూడు నెలల గర్భిణి. నాగరాజు సెంట్రింగ్ పనికి వెళ్లివచ్చి మద్యం మత్తులో రోజూ భార్య జ్యోత్స్నను మానసికంగా, శారీరకంగా వేధిస్తుండేవాడు. వీటిని భరించలేని ఆమె పిల్లలతో సహా వాంబేకాలనీ సమీపంలో ఉన్న రైలు పట్టాలపై పడుకున్నారు. దీనిపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు ఎస్ఐ సేనాపతి శ్రీనివాస్, కానిస్టేబుళ్లు నాగరాజు, ఈశ్వరావు అక్కడకెళ్లి జ్యోత్స్నకు నచ్చచెప్పి పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం కౌన్సిలింగ్ యిచ్చిన పోలీసులు ఆమెను హనుమాన్‌జంక్షన్లో హోమ్‌కు తీసుకెళ్లారు. ఆమె భర్త నాగరాజుపై కేసు నమోదు చేశారు. నార్త్ ఏసీపీ రవికాంత్ ఎస్ఐ శ్రీనివాస్‌ను, కానిస్టేబుళ్లు నాగరాజు, ఈశ్వరావును అభినందించారు.

క్రీడల్లో ప్రావీణ్యం పెంచుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా ప్రావీణ్యం పెంపొందించుకోవాలని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి అన్నారు. దుర్గాపురం గౌతమ్ పబ్లిక్ స్కూల్లో ఆడుదాం ఆంధ్రా పోటీల్లో విజేతల అభినందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలను అభినందించారు. పార్టీ నాయకులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌యూబీ పరిశీలన

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ ఆర్‌యూబీ పనులను శుక్రవారం ఎలక్ట్రికల్ డీఈ ఫణీకుమార్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆర్‌యూబీ పనులు తుదిదశకు చేరుకోవడంతో సర్వీసు రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసేందుకు విద్యుత్ స్తంభాలు ఎక్కడ వేయాలనే విషయంపై చర్చించారు. సాధ్యమైనంత త్వరలోనే విద్యుత్ స్తంభాల పనులు ప్రారంభిస్తామని డీఈ తెలిపారు.

ముగిసిన సుందరకాండ పారాయణం

విజయవాడ కల్చరల్: శ్రీ సీతారామ కల్యాణం జగత్ కల్యాణ కారకమని ఆధ్యాత్మికవేత్త డాక్టర్ ప్రోలాప్రగడ శ్రీనివాస్ అన్నారు. ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యాన మొగల్రాజపురంలోని సిద్ధార్థ కళాశాల ఆవరణలో వారం రోజులుగా నిర్వహిస్తున్న సుందరకాండ పారాయణం శుక్రవారం ముగిసింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహాలక్ష్మమ్మకు ప్రత్యేక పూజలు

పాయకాపురం(విజయవాడరూరల్): శ్రీనిదానంపాటి మహాలక్ష్మమ్మ వారి ఆలయ 14వ వార్షికోత్సవం శుక్రవారం రాజీవ్‌నగర్‌లో కనుల పండువగా జరిగింది. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలక్ష్మమ్మ ఆలయానికి ఎంతో విశిష్టత ఉందని ఆ తల్లి ఆశీస్సులు ప్రభుత్వంపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలుగు పాటకు గుర్తింపు తెచ్చిన కవి వేటూరి



విజయవాడ కల్చరల్: తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన కవి వేటూరి సుందరరామమూర్తి అని స్వరలయ అధ్యక్షుడు వై.సుబ్రహ్మణ్యం అన్నారు. స్వరలయ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం వేటూరి జయంతి, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు పాటకు సాహిత్య విలువలను తీసుకువచ్చిన కవి వేటూరిగా అభివర్ణించారు. గాయనీ గాయకులు వేటూరి రచించిన సినీ గీతాలను మధురంగా గానం చేశారు.

ముస్లింలకు అండగా జగన్ ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు అండగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. ఇస్లాంపేటలోని మినార్ మసీదును షేక్ ఆసిఫ్ శుక్రవారం మధ్యాహ్నం సందర్శించారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ పాలకవర్గ సభ్యులు ఆసిఫ్‌ను ఘనంగా సత్కరించారు. ఆసిఫ్ మాట్లాడుతూ మరింతగా మైనార్టీల అభివృద్ధికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అవసరమన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో జగన్ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ఆయన్ను ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నూర్‌అహ్మద్‌షరీఫ్, మొహ్మద్ అలీ, ఉపాధ్యక్షులు మొహ్మద్ మొహబూబ్, సహాయ కార్యదర్శి మొహ్మద్ అబ్దుల్ షబ్బీర్ పార్టీ నాయకులు చాన్‌బాషా, షేక్ బాజీ నజీర్ తదితరులు పాల్గొన్నారు.



ఆసిఫ్‌ను సత్కరిస్తున్న మసీదు కమిటీ

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

కృష్ణలంక(విజయవాడతూర్పు): కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటన కృష్ణలంక పీఎస్ పరిధిలో జరిగింది. విశాఖపట్నంకు చెందిన దుమ్మెద ఆదినారాయణకు ఇద్దరు కుమారులు. ఆయన మూడేళ్ల క్రితం మృతిచెందాడు. ఇతని రెండో కుమారుడు వంశీకృష్ణ(25) టెన్త్ చదివి ఇంటి వద్దనే ఉంటున్నాడు. కుటుంబసభ్యులు మందలించడంతో గతంలో రెండు సార్లు ఆత్మహత్య యత్నం చేశాడు. ఏడాది క్రితం రాణిగారితోట, తమ్మిన పోతురాజు వీధిలో నివసిస్తున్న ఆదినారాయణ సోదరుడు పైడిరాజు.. వంశీకృష్ణను ఆటోనగర్‌లో అతను చేస్తున్న ముఠాపనిలో పెట్టాడు. ఐదు రోజులుగా పనికి వెళ్లకుండా మద్యం సేవిస్తూ తిరుగుతుండడంతో కుటుంబ సభ్యులు అతనిని మందలించారు. రోజులాగానే గురువారం పైడిరాజు పనికి వెళ్లగా వంశీకృష్ణ ఇంటివద్దనే ఉన్నాడు. పైడిరాజు కుమారుడు సిద్ధు ట్యూషన్‌కు వెళ్లి రాత్రి 9 గంటలకు ఇంటికి వచ్చాడు. వంశీకృష్ణ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని కనిపించాడు. సిద్ధు కేకలు వేయడంతో స్థానికులు వంశీకృష్ణను కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.